క్లుప్తంగా

ఉమామహేశ్వర విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు



హోమం చేస్తున్న భక్తులు

ముస్తాబాద్: మండలంలోని గూడెం పురాతన శ్రీఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం హోమం జరిపారు. రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో వేడుకలను మూడు రోజులపాటు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు సరిత, ఉపసర్పంచు శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఇల్లంతకుంట: మండలంలోని పెద్దలింగాపూర్‌కు చెందిన తుల భారతికి రూ.47,500, ఒల్లాల శ్రీనివాస్‌కు రూ.40,000, శీలం బాలవ్వకు రూ.35,000, దురిశెట్టి ప్రకృతకు రూ.30,000, పసుల బాలవ్వకు రూ.25,000, జక్కుల ఎల్లయ్యకు రూ.15,000, దురిశెట్టి కిరణ్‌కు రూ.13,000 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను గురువారం లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొడిసెల జితేందర్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యురాలు కరివేద స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కు..

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లికి చెందిన కనపర్తి భారత–కృష్ణమాచారి దంపతులు తమ కూతురు వివాహం చేయగా కల్యాణలక్ష్మి పథకం కింద రూ.1,00,116 మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును గురువారం వారికి అందించారు. సర్పంచ్ కరుణ రంజిత్, ఉప సర్పంచ్ రామస్వామి, నాయకులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

ఇల్లంతకుంట: అనంతగిరిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ పల్లె నర్సింహారెడ్డి గురువారం ప్రారంభించారు. గ్రామ ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లద్దాలు అందిస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు పర్శరాం, ఉపసర్పంచ్ బాలకిషన్, వైద్యాధికారి లక్ష్మీప్రసన్న, సిబ్బంది ఉన్నారు.

మహిళకు ఆర్థికసాయం



నగదు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

చందుర్తి: ఎన్గల్ గ్రామానికి చెందిన ఆసంపల్లి జ్యోతి అనే ఒంటరి మహిళకు మనీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సంస్థ చైర్మన్ రమేశ్, సహస్ర దంపతుల కుమారుడు మేఘశ్యామ్ పుట్టిన రోజున సందర్భంగా సాయం చేసినట్లు వారు తెలిపారు. అలాగే గ్రామంలోని నిరుపేద పాటి స్వామి కుటుంబానికి 25 కిలోల బియ్యం అందించారు. ఫౌండేషన్ సభ్యులు గాలి ప్రవీణ్, మల్లేశం, అభి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లి నీరు వచ్చేలా చూడండి

- గ్రామాల్లో కుక్కల బెడద, విద్యుత్ సమస్యలు
- వచ్చే వేసవిలో ప్రజలకు నీటి ఇబ్బందులుండొద్దు
- వేములవాడ రూరల్ మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచ్ వేణు

వేములవాడరూరల్: ఎంపీటీసీ సభ్యులుగా గెలిచి, నాలుగేళ్లయినా తమకు ప్రత్యేకంగా కుర్చీలు కేటాయించలేదని వట్టెంల ఎంపీటీసీ సభ్యుడు రంగు వెంకటేశం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సరఫరా చేసే యూరియా నాణ్యతగా లేదని వెంకటాంపల్లి సర్పంచ్ కట్కం చంద్రయ్య మండిపడ్డారు. వేములవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బండ మల్లేశం అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశానికి పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు అనే పక్షపాత ధోరణి లేదని, ఇక్కడ అందరూ సమానమేనని అన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువైందని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఎల్లంపల్లి నీరు సకాలంలో వచ్చేలా చూడాలని కోరారు. చాలా గ్రామాల్లో లూజ్‌వైర్లు ఉన్నాయని, విద్యుత్ స్తంభాలు వంగిపోయాయని అన్నారు. స్పందించిన సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం మాట్లాడుతూ.. వరి కోతల పనులు పూర్తవగానే సరిచేస్తామని పేర్కొన్నారు. అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీరు ఇవ్వాలని, వచ్చే వేసవి కాలంలో ప్రజలు నీటికి ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. అన్ని గ్రామాల్లో శ్మశానవాటికలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని సర్పంచ్ ఏశ తిరుపతి కోరారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తానని సెస్ డైరెక్టర్ తెలిపారు. అనంతరం ఆయనను ప్రజాప్రతినిధులు శాలువాతో సత్కరించారు.

అధికారులపై చర్యలు తీసుకోండి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఉదయం 11 గంటలకు రావాల్సిన అధికారులు 12 గంటలకు వచ్చారు. సమయానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మల్లేశంయాదవ్ ఎంపీడీవో రాంరెడ్డిని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఏశ వాణి, ఎంపీవో శ్రీధర్, సూపరింటెండెంట్ రమేశ్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీల్లో అక్రమంగా విద్యుత్ వినియోగం



ఫాజుల్‌నగర్‌లో ఇటుక బట్టీలకు అక్రమంగా విద్యుత్ వినియోగించుకుంటున్నా సెస్ అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచ్ వేణు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. స్పందించకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు.

వీడియో వైరల్.. దివ్యాంగుడికి ట్రైసైకిల్



కాశయ్యకు సైకిల్ అందించిన యువకులు

చందుర్తి: ఓ వృద్ధ దివ్యాంగుడు అధికారులకు ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకున్నా ట్రైసైకిల్ అందలేదు. దీంతో ఆయన తన ఆవేదన వ్యక్తం చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పెగ్గర్ల రమేశ్‌రావు, యువకులు స్పందించి, ట్రైసైకిల్ అందించారు. వివరాల్లోకి వెళ్తే.. చందుర్తి మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన సంద్రగిరి కాశయ్య దివ్యాంగుడు. నడవలేని స్థితిలో ఉండి, నరకయాతన అనుభవిస్తున్నాడు. ట్రైసైకిల్ కొనుగోలు చేసే స్థోమత లేక ప్రభుత్వ సాయాన్ని ఆశిస్తూ పలుమార్లు దరఖాస్తు చేసుకున్నాడు. అయినా ఫలితం లేకపోయింది. బుధవారం ఎమ్మెల్యే రమేశ్‌బాబు చందుర్తిలో ట్రైసైకిళ్లు అందించారన్న విషయం తెలుసుకున్న కాశయ్య బోరున విలపించాడు. గ్రామానికే చెందిన కొందరు యువకులు దీన్ని వీడియో తీసి, సోషల్ మీడియాలో పోస్టు చేశారు. స్పందించిన ఎంపీటీసీ సభ్యుడు రమేశ్‌రావు ట్రైసైకిల్ సమకూర్చగా గురువారం సాయంత్రం ఆ వృద్ధుడికి అందజేశారు. బాధితుడి ఆవేదనను వెలుగులోకి తీసుకువచ్చిన యువకులు బండపెల్లి గంగాధర్, కొక్కుల నరేశ్, మారుపాక శేఖర్, బందేల వెంకటేశ్, సూత్రం సాగర్, తర్రె గణేశ్, కాదాసు రంజిత్‌లను స్థానికులు అభినందించారు.

'వడ్లకు మద్దతు ధర ఘనత కేంద్రానిదే'



మాట్లాడుతున్న సత్తయ్య

వేములవాడరూరల్: వడ్లకు మద్దతు ధర పెంచిన ఘనత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిదేనని ఆ పార్టీ వేములవాడ అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య అన్నారు. వేములవాడ రూరల్ మండలంలోని బొల్లారం, హన్మాజిపేట శక్తి కేంద్రం స్ట్రీట్ కార్నర్ మీటింగ్ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నయా నిజాంలా వ్యవహరిస్తున్న సీఎం కేసీఆర్‌ను గద్దెదించాలని కోరారు. ప్రజలను ప్రలోభాలకు గురి చేసి, ఓట్లు దండుకోవడమే లక్ష్యమన్నట్లు బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆ పార్టీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ సరిగా నెరవేర్చలేదన్నారు. బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి సాండెసారి మల్లికార్జున్, బూత్ అధ్యక్షుడు కంకనాల రాజు, నాయకులు కల్లెట్ల నరేశ్, ఆడెపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల మందు తాగించాలి





గొర్రెలకు నట్టల నివారణ మందు తాగిస్తున్న పశు వైద్యాధికారి సంతోష్‌కుమార్, సర్పంచు సుజాత

సిరిసిల్లఅర్బన్: జీవాలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందు తాగించాలని జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ టీవీ రమణమూర్తి అన్నారు. తంగళ్లపల్లి మండలంలోని రామన్నపల్లెలో గురువారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆత్మకూరి రంగయ్య, యాదవ సంఘం మండల ప్రధాన కార్యదర్శి మందాటి తిరుపతి, పశువైద్యాధికారి సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చందుర్తి: అనంతపల్లి, కొత్తపేట, మూడపల్లి గ్రామాల్లో గొర్రెలు, మేకలకు పశు వైద్యాధికారి నితిన్‌కుమార్ గురువారం నట్టల నివారణ మందు తాగించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, కాపరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని నాగారం, రామన్నపేట గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. కార్యక్రమంలో సర్పంచులు లావణ్య, సంతోష్, ఎంపీటీసీ సభ్యుడు మల్లేశ్, వైద్యాధికారి అంజిరెడ్డి, కాపరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాల ఏర్పాటు

ఎల్లారెడ్డిపేట: పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారిణి రేణుక అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్, రాగట్లపల్లి గ్రామాల్లో గురువారం పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. జీవాలకు వ్యాధులు వస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. పశుసంపదను కాపాడుకోవాలని చెప్పారు. అనంతరం పలు జీవాలకు నట్టల నివారణ మందు తాగించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కోల అంజమ్మ, దాసరి సుజాత, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాలపై నిర్లక్ష్యం

- చివరి దశలో పనులు నిలిచిపోయి, నిరుపయోగం
- ఇబ్బంది పడుతున్న పిల్లలు
- గోనె నాయక్, భూక్యా తండాల్లో పరిస్థితి
- వీర్నపల్లి మండలంలో 22 కేంద్రాలకు గాను ఏడింటికే సొంత భవనాలు





పనులు చివరి దశలో ఉన్న భూక్య, గోనె నాయక్ తండా అంగన్‌వాడీ భవనాలు

వీర్నపల్లి: మండలంలోని గోనె నాయక్, భూక్యా తండాల్లో అంగన్‌వాడీ కేంద్రాల కోసం నిర్మిస్తున్న భవనాల పనులు 90 శాతం పూర్తయ్యాయి. చివరి దశలో నిర్లక్ష్యంగా వదిలేయడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో మందుబాబులు, పేకాటరాయుళ్లకు అడ్డాలుగా మారగా చిన్నారులు అద్దె భవనాల్లోని ఇరుకు గదుల్లో ఇబ్బంది పడుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. భవనాల పనులు వెంటనే పూర్తి చేసి, పిల్లలకు సౌకర్యాలు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అద్దె భవనాల్లో, పాఠశాలల్లో 15 కేంద్రాలు..

వీర్నపల్లి మండలంలో 22 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో కేవలం ఏడింటికే సొంత భవనాలున్నాయి. మిగతా వాటిలో కొన్నింటిని అద్దె భవనాల్లో, మరికొన్నింటిని ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నారు. ఫలితంగా పిల్లలకు ఆడుకోవడానికి కాదు కదా కూర్చోవడానికి కూడా స్థలం లేదు.

ఎవరూ పట్టించుకుంటలేరు..



భూక్య తండాలో అంగన్‌వాడీ భవనం పనులు ఆగిపోయినయ్. మూడేళ్లుగా వదిలేసిన్రు. పిల్లలు ఇరుకు గదుల్లో ఇబ్బంది పడుతున్నరు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకుంటలేరు. – భూక్య సరోజ, భూక్య తండా

త్వరలోనే పూర్తి చేస్తాం..

వీర్నపల్లి మండలంలో అంగన్‌వాడీ భవనాల పనులు ఎక్కడెక్కడ ఆగిపోయాయో తెలుసుకొని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. త్వరలోనే పనులు పూర్తి చేసి, భవనాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.
– రవీంద్రనాథ్, పంచాయతీరాజ్ ఏఈ, వీర్నపల్లి

రైతుల కరెంట్ కష్టాలు తీర్చేందుకు కృషి



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి

ముస్తాబాద్: సెస్ పరిధిలోని రైతుల కరెంట్ కష్టాలు తీర్చేందుకు కృషి చేస్తున్నామని సంస్థ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి తెలిపారు. ముస్తాబాద్ మండలంలోని నామాపూర్‌లో పంట పొలాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెస్ నూతన పాలకవర్గం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టిందన్నారు. విద్యుత్ సరఫరాలో లో, హైఓల్టేజీ సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రైతులు కెపాసిటీకి మించి, నిబంధనలకు విరుద్ధంగా కనెక్షన్లు తీసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ సభ్యుడు గుండం నర్సయ్య, సర్పంచ్ వెల్ముల విజయ, ఎంపీటీసీ సభ్యురాలు లలిత, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, సురేందర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాలక్ష్మి కల్యాణం

కోనరావుపేట: మల్కపేట మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణం అనంతరం అమ్మవారికి బోనాలు తీసి, భక్తులకు అన్నదానం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

సిరిసిల్లటౌన్: బాలల సంరక్షణ అందరి బాధ్యత అని 13వ వార్డు కౌన్సిలర్ జాగిరి శైలు అన్నారు. గురువారం సమగ్ర బాలల సంరక్షణ పథకంలో భాగంగా నూతన కమిటీ కోసం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బాల్యవివాహాలను అరికట్టాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు రజని, వీణ, ఆర్పీ రమ్య, ఆశవర్కర్ వర్ష ఉన్నారు.

పాఠశాలల పరిశీలన

ఇల్లంతకుంట: కందికట్కూర్‌లోని ప్రాథమిక పాఠశాలలను రాష్ట్ర ఎఫ్ఎల్ఎన్ బృందం పరిశీలకురాలు శ్రీలతారావు గురువారం పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ పేపర్లు, రికార్డులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులతో ఇంగ్లిష్, తెలుగు పాఠ్యాంశాలు చదివించారు. టీచర్లకు తొలిమెట్టు కార్యక్రమంపై పలు సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇసుక వాహనాల పట్టివేత

ముస్తాబాద్: బందనకల్, కొండాపూర్ వద్ద ఇసుక తరలిస్తున్న మూడు వాహనాలను గురువారం తెల్లవారుజామున పట్టుకున్నామని ఆర్ఐ శ్యాం తెలిపారు. బందనకల్ వద్ద ఒక వాహనం, కొండాపూర్ మానేరు వాగు వద్ద రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్సైకి బెస్ట్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎస్సై నాగరాజు

వేములవాడరూరల్: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్సై నాగరాజును జనవరి నెలకు గాను జిల్లాలో ఉత్తమ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ అవార్డు వరించింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఠాణాల్లో ఉత్తమ పనితీరు కనబర్చిన వారికి ప్రతినెలా పురస్కారం ఇస్తారు. గత నెలకు ఉత్తమ ఇన్వెస్టిగేషన్ విభాగంలో ఎస్సై నాగరాజుకు, ఉత్తమ బ్లూకోల్ట్స్ విభాగంలో కానిస్టేబుల్ సతీశ్‌కు మొత్తంగా రెండు అవార్డులూ వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌కే వచ్చాయి. ఎస్పీ అఖిల్ మహాజన్ చేతులమీదుగా వారు గురువారం అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ బన్సీలాల్ వారిని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వేములవాడ అర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపెల్లి శివారులోని కరీంనగర్–సిరిసిల్ల రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని, ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లికి చెందిన శంకర్ గురువారం కరీంనగర్ నుంచి బైక్‌పై వేములవాడ వస్తున్నాడు. నాంపెల్లి గుట్ట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతని కాలు విరిగింది. స్థానికులు 108 వాహనంలో వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం

- కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఇల్లంతకుంట(మానకొండూర్): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలుపొంది, కాంగ్రెస్ సర్కారు ఏర్పాటవడం ఖాయమని కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ధీమా వ్యక్తం చేశారు. ఇల్లంతకుంట మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. దళితబంధు పేరుతో దళితులను మోసం చేస్తున్నారని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి, రూ.90 వేలు చేస్తామని మాట్లాడటం సరికాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, ఎస్ఎల్ గౌడ్, వినయ్, వెంకటి, ప్రసాద్, రాజేశం, సత్యప్రసన్న, జమాల్, చందు, లింగం, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై దాడి అమానుషం



మాట్లాడుతున్న నర్సయ్య

ఎల్లారెడ్డిపేట: వరంగల్ జిల్లాలో యూత్ కాంగ్రెస్ నాయకులపై జరిగిన దాడి అమానుషమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేటలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేస్తున్న పాదయాత్రను చూసి, ఓర్వలేకనే తమ నాయకులపై దాడి చేశారని ఆరోపించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, రాంరెడ్డి, దేవయ్య, శ్రీనివాస్, ఎల్లయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో.. కస్తూరిబా విద్యాలయం

- వానాకాలంలో వాగు దాటితేనే పాఠశాలకు చేరుకోవడం
- ఆవరణలో రాత్రిపూట చీకటే
- కాగితాలకే పరిమితమైన ప్రహరీ నిర్మాణం
- అడవి జంతువులు వస్తుండటంతో భయపడుతున్న విద్యార్థినులు
- వీర్నపల్లిలో పరిస్థితి



వీర్నపల్లి కస్తూరిబా విద్యాలయం



వాగు నీటిలో నడుస్తున్న సిబ్బంది (ఫైల్)



దారి పక్కన నిలిచిన మురికి నీరు

వీర్నపల్లి: ఊరికి దూరంగా అడవిని ఆనుకొని ఉన్న ఆ విద్యాలయం సమస్యలకు నిలయంగా మారింది. ఫలితంగా విద్యార్థినులు భయంభయంగా చదువు కొనసాగిస్తున్నారు. ఏటా వానాకాలంలో గ్రామం నుంచి పాఠశాల వరకు మూడు కిలోమీటర్ల దూరం పారుతున్న వాగు దాటి వెళ్లాలి. వాగుపై వంతెన నిర్మాణం కలగానే మిగిలింది. ఇదీ వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం దుస్థితి. గ్రామం నుంచి పాఠశాల వరకు వీధి దీపాలు లేకపోవడంతో నాన్ టీచింగ్ స్టాఫ్, పిల్లల తల్లిదండ్రులు రాత్రిళ్లు చీకట్లోనే వెళ్లాల్సి వస్తోంది. రాత్రిపూట విద్యార్థినులు అనారోగ్యం బారిన పడితే వారిని ఆస్పత్రికి తరలించడం కష్టంగా మారుతోంది. సమస్యలు పరిష్కరించాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు మండలకేంద్రంతోపాటు పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. అయినప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారు.

అడవి జంతువులతో భయంభయం..

పాఠశాలకు ప్రహరీ నిర్మాణ అంశం కాగితాలకే పరిమితమైంది. దీంతో రాత్రిపూట అడవి జంతువులు, విషసర్పాలు వస్తున్నాయి. విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. మారుమూల ప్రాంతాల పేద పిల్లలకు ప్రభుత్వపరంగా ఉచిత విద్యనందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ విద్యాలయంలో కనీస వసతులు కల్పించడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి, వంతెన, ప్రహరీ నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వేసవిలో తాగునీటి తిప్పలు

కేజీబీవీలో 280 మంది చదువుతున్నారు. ఏటా వేసవి కాలంలో తాగునీటికి తిప్పలు తప్పడం లేదు. పాఠశాలలో ఉన్న ఒకే బోరుతో విద్యార్థులందరికీ నీరందించడం కష్టమవుతోంది. ఈ వేసవిలోనైనా మరో బోరు వేయాల్సిన అవసరం ఉంది. శాశ్వత డ్రైనేజీలు లేకపోవడంతో పాఠశాల నుంచి వచ్చే మురికి నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి, దుర్గంధం వెదజల్లుతోంది.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ ప్రారంభమైనందున విద్యార్థినుల సంఖ్య పెరిగింది. మరో బోరు ఏర్పాటు విషయాన్ని ప్రజాప్రతినిధులకు చెప్పాం. హామీ ఇచ్చారు.
– నీలిమ, ప్రత్యేక అధికారి, కేజీబీవీ, వీర్నపల్లి

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి



పాఠశాలకు ప్రహరీ లేకపోవడం వల్ల అడవి జంతువులు వస్తున్నాయి. దీనివల్ల రాత్రయితే మేము, నైట్ డ్యూటీ చేసే సిబ్బంది భయభయంగా గడుపుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, వీధి దీపాలు ఏర్పాటు చేసి, ప్రహరీ నిర్మించాలి.
– ఎం.వెన్నెల, పదోతరగతి